# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉభయ రాష్ట్రాల ప్రజలు క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఈ రోజు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.**

2. **తెలుగు ప్రజల ఇళ్లలో నూతన సంవత్సరం శుభాలు కలుగ జేయాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు.**

3. **దేశ సమైక్యత, అభివృద్ధి కోసం భారతీయ జనతాపార్టీకే ఓటు వేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు.**

4. **కృష్ణా జలాల వివాదంపై పూర్తి వివరణ దాఖలు చేసే గడువును పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తిని కృష్ణా ట్రిబ్యునల్ తిరస్కరించింది.**

5. **హైదరాబాద్‌లోని మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తెలిపారు.**

==========================

ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల ప్రజలు ఈ రోజు క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వ దినాన్ని ఆనందోత్సాహాలతో సంప్రదాయమబద్ధంగా జరుపుకుంటున్నారు. గతించిన శోభకృత నామ సంవత్సరంలో అనుభవించిన కష్ట సుఖాలను గుర్తు చేసుకుని ఆ ఏడాదికి వీడ్కోలు చెబుతూ....కొత్త ఆశలు.. క్రొంగొత్త ఆకాంక్షలతో నూతన క్రోధి నామ సంవత్సరానికి తెలుగు ప్రజలు స్వాగతం పలుకుతూ ఈ పర్వదినాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తున్నారు. చైత్ర మాసం శుక్లపక్షంలో వచ్చే శుద్ధ పాడ్యమి నాడు ఉగాది పండుగ జరుపుకోవడం మన ఆనవాయితీ.పవిత్రమైన ఈ రోజు నుండే వసంత ఋతువు ఆరంభమవుతుంది.షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడిని స్వీకరించడం ఉగాది పండుగ ప్రత్యేకత. జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సవాళ్ళను సమానంగా స్వీకరించాలని ఉగాది పచ్చడి సందేశం ఇస్తుంది. బెల్లం, ఉప్పు,చింతపండు, వేప పువ్వు,పులుపు,కారం వంటి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసే ఉగాది పచ్చడి మన శరీరానికి ఆరోగ్య పరంగా ఎంతో మేలు చేకూరుస్తుందని ఎన్నో ఔషధ గుణాలు కలిగి వున్నాయని భారతీయ సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం సూచిస్తోంది.తెలుగు ప్రజలు మాత్రమే కాకుండా దేశంలో పలు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ రోజు నూతన సంవత్సర పర్వ దినాన్ని జరుపుకుంటున్నారు.“”గుడి పడ్వా “”” అన్న పేరుతో మరాఠీ ప్రజలు “”” పుత్తాండు “”” గా తమిళులు “”” విషు

“””” గా మలయాళీలు , వైశాఖి గా సిక్కులు “””” పొయ్ లా బైశాఖి “””” గా బెంగాలీలు ఈ రోజు ఈ పండుగను నిర్వహిస్తున్నారు. కాల గమనం ..., గ్రహ స్థితిగతుల గురించి అవగాహన చేసుకునేందుకు పంచాంగ పఠనం చేయడం ఉగాది పర్వదినంలో ఒక ముఖ్య ఘట్టం. ఇలాఉండగా.. తిరుమల పుణ్యక్షేత్రంలో ఉగాది వేడుకలు ఈ రోజు తెల్లవారుఝామున ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగమ శాస్త్ర పండితుల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, ఉగాది ఆస్థాన కార్యక్రమాలు ఈ రోజు జరగనున్నాయి.

---------------------------

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్ అబ్దుల్ నజీర్, సి. పి. రాధాకృష్ణన్, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వై.ఎస్. జగన్ మోహన రెడ్డి, ఎ.రేవంత్ రెడ్డి,తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జన సేన అధ్యక్షుడు కె.పవన్ కళ్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.‘ఈ కొత్త సంవత్సరం మన ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, కొత్త ఆశలను చిగురింపచేస్తుందని’ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్.. పేర్కొన్నారు.

కొత్త సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని,పల్లెలు,పట్టణాలలో ప్రతి ఇల్లు కళకళలాడాలని, మన సంస్కృతీ సంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని వై.ఎస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన రెడ్డి ఆకాంక్షించారు.

కొత్త సంవత్సరం ప్రజలకు శుభాలు కలుగజేయాలని వారి ఆశలు,ఆకాంక్షకు నెరవేరాలని ఆశిస్తున్నట్టు తెలంగాణ పీసీసీ అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ ఉగాది అందరికీ శుభాలు కలుగజేయాలని,అందరికీ ఆనందాన్ని, అభివృద్ధిని,ఆరోగ్యాన్ని ఇవ్వాలని కోరుతున్నట్టు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

---------------------------

భారత దేశ అభివృద్ధి.. సమైక్యత కోసం వచ్చే ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకే ప్రజలు ఓటు వేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. నిన్న జరిగిన తెలంగాణా రాష్ట్రంలోని చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గ బి. జె. పి. శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ హయాంలో దేశంలో అన్ని వస్తువులను దిగుమతి చేసుకునే పరిస్థితి నెలకొందని ప్రస్తుతం మనమే విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసుకునే స్థితికి ఎదిగామని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా మత కలహాలు,కర్ఫ్యూలు లేవని అన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు నీతివంతమైన పాలన అందించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల మధ్య నెలకొన్న కృష్ణా జలాల వివాదం అంశంపై పూర్తి వివరణ దాఖలు చేసేందుకు వచ్చే జూన్ నెల వరకు సమయం ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ చేసిన విజ్ఞప్తిని కృష్ణా ట్రిబ్యునల్ త్రోసి పుచ్చింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం వచ్చే జూన్ నెల వరకు గడువు ఇవ్వడం సాధ్యం కాదని,ఈ నెల 29 వ తేదీ లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 10,వేల670 తపాలా కార్యాలయాల ద్వారా ప్రజల్లో

ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నిన్న శ్రీకారం చుట్టారు. తపాలా శాఖ ముద్రించిన ఓటర్ల అవగాహనా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఓటర్లలో అవగాహన కల్పించేందుకు తపాలా శాఖతో ఎన్నికల సంఘం ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు విలువ గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

---------------------------

హైదరాబాద్‌లోని మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేపడతామని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పెట్టుబడిదారులు, వాటాదారుల్లో విశ్వాసాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బోర్డు సమావేశం నిన్న హైదరాబాద్‌లో శాంతికుమారి అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ..మూసీ పరీవాహక ప్రాంతాన్ని వేగంగా అభివృద్ధి చేసే విధంగా కొన్ని ప్రాజెక్టులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమైన తరువాత కూడా మంచి నీటి విరామం “”” విధానాన్ని కొనసాగించాలని జిలా విద్యాశాఖాధికారులను పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే ఏప్రిల్ 23 వ తేదీ వరకు ప్రస్తుతం అమలు జరుగుతున్న మంచినీటి విరామం విధానం నిర్వహణను పర్యవేక్షించాలని ఒక ప్రకటనలో ఆయన జిల్లా విద్యా శాఖాధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులలో మంచినీరు తాగే అలవాటును పెంపొందించాలని,తరచూ మంచినీరు తీసుకోవడం శరీరానికి ఎంత అవసరమో వారికి అవగాహన కల్పించాలని ప్రవీణ్ ప్రకాష్ సూచించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లోని పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు పంచాయతీ పరిధి శివారు గ్రామం గంటావారిపాలెంలో నిర్వహించనున్న ఉగాది వేడుకల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈరోజు సతీసమేతంగా పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మేమంతా సిద్ధం బస్సు యాత్ర నేడు పల్నాడు జిల్లాలో కొనసాగనుంది.

---------------------------

తెలంగాణలోని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ రోజు ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 23 వరకు కొనసాగనున్న ఈ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ నెల 16న నిర్వహించే ఎదుర్కోలు వేడుకకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టారు.17వ తేదిన ప్రధాన ఉత్సవమైన శ్రీరామనవమి పండుగ సందర్భంగా మిథిలా మండపంలో శ్రీసీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 35 వేల మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు మండప ప్రాంగణాన్ని 24 సెక్టార్లుగా విభజించారు. ఇందులో ప్రవేశానికి టికెట్లను ఆన్‌లైన్‌తో పాటు కౌంటర్లలో విక్రయిస్తున్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి విషయంలో ఇచ్చిన హామీని ముఖ్య మంత్రి వై ఎస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన రెడ్డి విస్మరించారని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల విమర్శించారు. వై.ఎస్.ఆర్. జిల్లా దువ్వూరు పట్టణంలో నిన్న జరిగిన కాంగ్రెస్ ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర అభివృద్ధిపై జగన్ మోహన రెడ్డి మాట తప్పుతారని తాను భావించ లేదని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక హెూదా,పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్రానికి రాజధాని నిర్మించడం వంటి అన్ని అంశాలలో జగన్ మోహన రెడ్డి విఫలమయ్యారని ,రాష్ట్రంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని షర్మిల పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోవై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించడమే తెలుగు దేశం,జన సేన,భారతీయ జనతా పార్టీల కూటమి లక్ష్యమని కూటమి సీనియర్ నాయకులు స్పష్టం చేశారు.అమరావతిలో నిన్న జరిగిన కూటమి సమావేశంలో పాల్గొన్న నేతలు రానున్న సార్వత్రిక ఎన్నికలలో కూటమి మేనిఫెస్టో అంశంపై చర్చించారు.

---------------------------

ఉత్తర కోస్తాంధ్ర నుంచి దక్షిణ తమిళనాడు వరకు రాయలసీమ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడిన కారణంగా ఈ రోజు, రేపు రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు జల్లులు కురిసే సూచనలు ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు ద్రోణి ప్రభావంతో నిన్న రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్ర జిల్లాలు, దక్షిణ కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గింది.

======================